# కనువిప్పు

-యం.గాంధీ

దేవానంద్ ఇంట్లోకి వచ్చి జేబులోవున్న పర్సు తీసి చూసాడు. అందులో పదమూడు వందల డబ్బు, ఆ పర్సు తాలూకు వ్యక్తి విజిటింగ్ కార్డ్సు ఉన్నాయి. ఆ కార్డ్సుమీద ఆ పర్సు పోగొట్టుకున్న వ్యక్తి ఫోన్ నెంబర్ ఉంది. డ్రైవింగ్ లైసెన్స్‌లో వున్న పేరునుబట్టి ఆ పర్సు పోగొట్టుకున్న వ్యక్తి పేరు ప్రసాద్ అని తెలిసింది.

ఆ ప్రసాద్ అనే వ్యక్తికి ఫోన్ చేసి 'మీ పర్సు నాకు దొరికింది. వచ్చి తీసుకెళ్లండి' అని చెప్ప వచ్చు. కానీ దేవానంద్ అలా చేయలేదు. అందులో వున్న డబ్బు తీసుకుని ఆ పర్సును అటక మీద విసిరేసి 'పోగొట్టుకున్నవాడు దురదృష్టవంతుడు, ఆ పర్సు దొరికిన తను అదృష్టవంతుడు' అని సరిపెట్టుకున్నాడు.

ఆ తరువాత ఫ్రెష్‌గా స్నానంచేసి బార్‌కు బయల్దేరాడు. తనకి దొరికిన డబ్బుతో మూడు రోజులపాటు తనివితీరా తాగాడు దేవానంద్.

***

నెలరోజులు గడిచాయి.

ఓరోజు దేవానంద్ పొద్దునే పార్కులో మార్నింగ్ వాక్‌కి వెళ్లి ఇంటికొచ్చి చూసుకుంటే తన ప్యాంటులో పర్సులేదు. అందులో మూడు వేల డబ్బు, ఎటిఎం కార్డ్సు, క్రెడిట్ కార్డ్సు ఉన్నాయి. ఆదరాబాదరా పార్కుకెళ్లి వెతికాడు. ఎక్కడా కనిపించలేదు.

అక్కడున్నవాళ్లని అడిగాడు. అందరూ తెలీదన్నారు. ఆమధ్య తనకు ఎవరిదో పర్సు దొరికితే తను ఇవ్వలేదు. అందరూ తనలాగే వుంటారనుకుని తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ ఇంటి వైపు నడిచాడు.

***


మూడువేలు పోయాయన్న బాధతో ఆది వారం కూడా ఎక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే పడుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు. సాయంత్రం అవుతుండగా సెల్ మోగింది.

"హలో... మీ పేరు దేవానందా?'' అడిగాడు ఫోన్ చేసిన వ్యక్తి.

"అవునండీ'' అన్నాడు దేవానంద్.

"మీ పర్సు ఏమైనా పోయిందా?''

"అవును సార్. కృష్ణకాంత్ పార్కులో పోయింది. అందులో మూడువేల డబ్బు కూడా ఉంది'' అని ఆతృతగా చెప్పాడు దేవానంద్.



"నాకు దొరికింది. వచ్చి తీసుకెళ్లండి'' అని అడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేసాడు ఆ వ్యక్తి.

ఆగమేఘాల మీద ఆ వ్యక్తి చెప్పిన అడ్రస్‌కు చేరుకున్నాడు దేవానంద్.

తన పర్సులో ఎంత డబ్బు ఉందో అంతా వుంది. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నిజాయితీగా ఇచ్చేసాడు.

పోయిన డబ్బు దొరికితే ఎంత ఆనందంగా ఉంటుందో అనుభవపూర్వకంగా దేవానంద్ తెలుసుకున్నాడు. ఇప్పుడు దేవానంద్‌కు కనువిప్పు కలిగింది.

ఇంటికి వచ్చాక ఆమధ్య తనకి దొరికితే అటకమీద విసిరేసిన పర్సును తీసి ఆ పర్సు తాలూకు వ్యక్తికి ఫోన్ చేసాడు.

"మీ పర్సు నాకు దొరికింది. కానీ అనుకోని పరిస్థితులవల్ల వెంటనే మీకు ఫోన్ చేయలేకపోయాను. క్షమించండి. వచ్చి మీ పర్సు తీసుకెళ్లండి'' అంటూ తన అడ్రస్ చెప్పాడు దేవానంద్.

★